అపస్మారక స్థితిలోనే ఇలా గణేశన్

- ఆరు రోజులుగా కొనసాగుతున్న చికిత్స

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల క్రితం తన నివాసంలో జారిపడి తలకు బలమైన గాయాలు తగిలి అపోలో ఆస్పత్రిలో చేరిన నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేషన్ ఇంకా అపస్మారక స్థితిలోనే ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 8వ తేదీ ఉదయం టి.నగర్‌లోని తన నివాసంలో సొమ్మసిల్లి పడిపోయిన గణేశన్ తల వెనుక బలమైన గాయాలు తగిలాయి. కుటుంబీకులు వెంటనే ఆయనను అపోలో ఆస్పత్రికి తరలించారు. గత ఆరు రోజులుగా ఎమెర్జెన్సీ వార్డులో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. అయితే ఇంకా ఆయన స్పృహలోకి రాలేదని వైద్యనిపుణులు తెలిపారు.



ఈంజంబాక్కంలోని పర్యాటక ప్రాంతంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్వేరియం నీటి అడుగున ఎనిమిది అడుగుల జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న స్కూబా డైవర్

3న రాష్ట్రపతి రాక



చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒక్క రోజు పర్యటన నిమిత్తం సెప్టెంబర్ 3న రాష్ట్రానికి రానున్నారు. తిరువారూరు జిల్లా నీలక్కుడిలోని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ 10వ స్నాతకోత్సవంలో ఆమె విశిష్ట అతిథిగా పాల్గొని స్నాతకోత్సవ సందేశమిచ్చి, విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. గత యేడాది ఈ యూనివర్శిటీ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొనాల్సిన నేపథ్యంలో వాతావరణం అనుకూలించక ఆమె తన ప్రయాణాన్ని చివరిక్షణంలో రద్దు చేసుకున్నారు. ఈ యేడాది సెప్టెంబర్ 3న జరుగనున్న స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అంగీకరించినట్లు విశ్వవిద్యాలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

అన్నాడీఎంకేకు ఎదురుదెబ్బ

డీఎంకే గూటికి మాజీ ఎంపీ డాక్టర్ మైత్రేయన్

- స్టాలిన్ సమక్షంలో పార్టీ సభ్యత్వం స్వీకరణ

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష అన్నాడీఎంకేకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత, మాజీ ఎంపీ, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు మైత్రేయన్ డీఎంకేలో చేరారు. బుధవారం ఉదయం అన్నా అరివాలయానికి వెళ్లిన డాక్టర్ మైత్రేయన్.. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. స్టాలిన్ ఆయనకు సభ్యత్వ కార్డు అందజేసి, కండువా వేసి స్వాగతించారు. అన్నాడీఎంకేలో 2002 నుంచి మూడుసార్లు రాజ్యసభ సభ్యుడిగా మైత్రేయన్ సేవలందించారు. ఆ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శిగాను పనిచేశారు. గత నెల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తనకు సీటు వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పార్టీ అధిష్ఠానం ఆయనకు ఆ అవకాశం ఇవ్వకపోవడంతో కినుక వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, ఎం.సుబ్రమణ్యం, కేఎన్ నెహ్రూ, పార్టీ ప్రముఖులు ఆర్ఎస్ భారతి, ఇళంగోవన్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవలే అన్నాడీఎంకేకు చెందిన మాజీ ఎంపీ అన్వర్‌రాజా కూడా డీఎంకేలో చేరిన విషయం తెలిసిందే.

మైత్రేయన్ రాజకీయ పయనం...

డాక్టర్ మైత్రేయన్ మొదట బీజేపీలో చేరి తన రాజకీయ పయనం ప్రారంభించారు. 1995 నుండి 1997 వరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత జయలలిత హయాంలో 1999లో అన్నాడీఎంకేలో చేరి, రాజ్యసభ సభ్యుడిగా మూడుసార్లు ఆ పార్టీ తరపున ఎన్నికయ్యారు. పార్టీ వ్యవస్థాపక కార్యదర్శిగా సేవలందించారు. జయ మృతి తర్వాత అన్నాడీఎంకే రెండువర్గాలుగా విడిపోయినప్పుడు మైత్రేయన్ మాజీ సీఎం పన్నీర్‌సెల్వం వైపు నిలబడ్డారు. దీంతో ఆయన్ని పార్టీ బహిష్కరించడంతో ఆయన 2023లో మళ్ళీ బీజేపీలో చేరారు.



మైత్రేయన్‌ను సత్కరిస్తున్న స్టాలిన్

అయోమయంలో అన్నాడీఎంకే: మైత్రేయన్

బీజేపీతో పొత్తు పెట్టుకోవడం నచ్చక అన్నాడీఎంకే శ్రేణులు అయోమయంలో ఉన్నాయని, పార్టీ నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నిరంకుశధోరణితో వ్యవహరిస్తున్నారని డాక్టర్ మైత్రేయన్ విమర్శించారు. సీఎంతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ తన సేవలు ఉపయోగించుకోనందువల్లే డీఎంకే సభ్యత్వం స్వీకరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని, విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో ఆర్థికపరంగాను అభివృద్ధి చెందినట్లు కేంద్ర ప్రభుత్వమే వెల్లడించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చేసిన రాష్ట్ర స్వయంప్రతిపత్తి నినాదం స్టాలిన్ నాయకత్వంలో ఆచరణాత్మకమైందని, రాష్ట్ర హక్కుల కోసం తీవ్రంగా పోరాడుతున్నారని మైత్రేయన్ ప్రశంసించారు. వచ్చే యేడాది శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘన విజయం సాధిస్తుందని, ఆ కూటమిని గెలిపించడానికి రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.. ఈ యేడాదే కాదు వచ్చే యేడాది కూడా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సెయింట్‌జార్జి కోటపై స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ప్రస్తుతం అన్నాడీఎంకే ప్రధాన ప్రతిపక్షంగా తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించలేకపోయిందని, ఈపీఎస్ తొందరపడి బీజేపీతో పొత్తు పెట్టుకోవడం పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అధికారంలో భాగస్వామ్యం కలిగి ఉంటామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనను పార్టీకి చెందినవారెవరూ ఖండించకుండా మౌనం పాటిస్తున్నారని, దీంతో పార్టీలో అయోమయ పరిస్థితులే కొనసాగుతున్నాయని, కొంతమంది స్వార్థపరులు పార్టీని కబళించేందుకు కూడా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారని డాక్టర్ మైత్రేయన్ ఆరోపించారు.

రాష్ట్రంలో బిహార్ తరహా సవరణలు వద్దు



జిల్లా కార్యదర్శుల సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



సమావేశానికి హాజరైన పార్టీ జిల్లా శాఖ కార్యదర్శులు

- ఈసీకి డీఎంకే జిల్లానేతల డిమాండ్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ఓటర్ల జాబితాను ఎలాంటి అవకతవకలు లేకుండా నిష్పక్షపాతంగా, నిజాయితీగా సవరించాలే తప్ప, బిహార్ తరహా సవరణ చేయకూడదంటూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం డిమాండ్ చేసింది. స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగే ఎన్నికల నిర్వహణకు పెనుముప్పు కలిగించేలా ఓట్ల చోరీ, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు పాల్పడుతున్న కేంద్ర ఎన్నికల సంఘం అప్రజాస్వామిక విధానాలను ఈ సమావేశం తీవ్రంగా ఖండిస్తూ ఓ తీర్మానం చేసింది. తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో బుధవారం డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్‌బాలు, మంత్రి కేఎన్‌నెహ్రూ, ఐ పెరియసామి, ఎంపీలు తిరుచ్చి శివా, ఎ.రాజా, అందియూరు సెల్వరాజ్, కనిమొళి, ఆర్ఎస్ భారతి, టీకేఎస్ ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బిహార్‌లో పౌరుల ఓటు హక్కులను హరించేలా కేంద్ర ఎన్నికల సంఘంతో కుమ్మక్కయిన బీజేపీ జరుపుతున్న ఓట్ల చోరీని, ప్రత్యేక సమగ్ర సవరణను ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి నేతలను అరెస్టు లను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ తీర్మానంలో పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి సాగిస్తున్న ఈ అక్రమాలు ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తాయన్నారు. ఎన్నికల ప్రక్రియకు మూలాధారమే ఓటర్ల జాబితా అని, ఆ జాబితాను లోపాలకు తావులేకుండా సవరించాలే తప్ప ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో వందల సంఖ్యలో ఓటర్లను తొలగించడం గర్హనీయమన్నారు. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో జరిగిన ఓట్ల చోరీని డీఎంకే, ఇండియా కూటమి పార్టీలు తీవ్రంగా ఖండించినప్పటికీ సుప్రీం కోర్టు సామూహిక పరమైన తొలగింపులు (మాస్ డెలిషన్) ఉంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించిన తర్వాత కూడా ఆ రాష్ట్రంలో కుంటి సాకులు చెప్పి 65లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. జూలైలో డీఎంకే ఎంపీలు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు చనిపోయిన ఓటర్ల తొలగింపు, బీఎల్వోలు, బీఎల్ఏలతో అనుసంధానించడం, ప్రాంతీయ, స్థానిక భాషల్లో మాన్యువల్స్ పంపిణీ, తపాలా ఓట్ల లెక్కింపులో ఎదురవుతున్న గందరగోళ పరిస్థితులను చక్కదిద్దడం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నివాసస్థలం, జననతేదీలను తెలిపే నిర్ధారణ పత్రాలకు అంగీకరించడం వంటి డిమాండ్లను ఆమోదించాలని రెండో తీర్మానంలో డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులకు వర్తింపజేసేలా చేసిన మూడో తీర్మానంలో 'ఏకతాటిపై రాష్ట్రం' పేరుతో జరుపుతున్న సభ్యత్వ కార్యక్రమాలను వేగిరపరచాలని జిల్లా కార్యదర్శులకు, పార్టీ నేతలకు ఆదేశాలిచ్చారు. ఈ యేడాదిలోగానే సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలు పూర్తిచేయాలని పార్టీ సూచించింది.

27లక్షల మంది చిన్నారులకు మెదడువాపు టీకా

- మంత్రి సుబ్రమణ్యం
- టీకా పంపిణీ విస్తరణ షురూ



శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లో మెదడు వాపు వ్యాధి నిరోధక టీకా పంపిణీ తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ఆ టీకా ఉచితంగా వేసేందుకు సన్నాహాలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఈ పథకాన్ని మంత్రి సుబ్రమణ్యం బుధవారం ప్రారంభించి,నగరంలోని కొన్ని శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 2007లో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ప్రభుత్వ హయాంలో మెదడు వాపు వ్యాధి నిరోధక టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని గుర్తు చేశారు. అప్పట్లో మొదట 15 జిల్లాల్లో, చెన్నైలోని రెండు మండలాల్లో ఈ పథకం అమలు చేశారని తెలిపారు. చెన్నైలోని మిగిలిన 13 మండలాలతో పాటు కాంచీపురం, తిరునల్వేలి, తెన్‌కాశి, వేలూరు తదితర 7జిల్లాలకు ఈ పథకాన్ని విస్తరించా మన్నారు. తమిళనాట చిన్నారులకు 11 రకాల టీకాలు వేస్తున్నామన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు ఈ వ్యాధి బారిన పడే అవకాశముందని, మెదడు వాపు వ్యాధి దోమల కారణంగా వస్తుందని దీనివల్ల చిన్నారులు చనిపోయే అవకాశం కూడా వుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు మరో ఏడు జిల్లాకు టీకా పంపిణీ విస్తరించామన్నారు. ఇందులో భాగంగా 27,3,152 మంది చిన్నారులకు టీకా వేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకోసం మూడు దశల్లో శిబిరాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చిన్నారులకు బుధవారం నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు టీకాలు వేస్తామన్నారు. సోమ, గురు, శుక్రవారాల్లో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ టీకాలు వేయించుకోని చిన్నారుల కోసం ప్రత్యేకంగా మరో శిబిరం నిర్వహిస్తామన్నారు. అంగన్వాడీల్లోని చిన్నారులకు రెండో దశలో శిబిరం ఉంటుమని, 3వ దశలో అనాథాశ్రమాల్లోని చిన్నారులకు వేస్తామని మంత్రి వివరించారు.

పంద్రాగస్టుకు చెన్నై ముస్తాబు

- 9,100 మంది పోలీసులతో భద్రత



సచివాలయం ముందు రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై 79వ స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక అంశాలతో ముస్తాబైంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. జెండా పండుగను కోలాహలంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో 9,100 మంది, రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.. సెయింట్‌జార్జి కోట ప్రధాన ప్రవేశ ద్వారంలో జెండా స్తంభంపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఈనెల 15వ తేది ఉదయం జాతీయ పతాకం ఎగురవేసి, రాష్ట్రప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు పంద్రాగస్టు పండుగను ఉత్సాహంగా జరుపుకోనున్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన చేసేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. జెండా పండుగను పురస్కరించుకుని మెరీనాబీచ్ రోడ్డులోని సచివాలయ భవనం, జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం, దక్షిణ రైల్వే కార్యాలయం, సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూర్ రైల్వే స్టేషన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వుల మేరకు అడిషనల్ కమిషనర్లు ఎస్.కన్నన్, జి.కార్తికేయన్, ప్రవేశ్‌కుమార్ పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్లు, ఎస్పీలు, ఏఎస్పీ, సీఐలు, పోలీసులు మొత్తం 9,100 మంది విమానాశ్రయం, బస్ టెర్మినళ్లు, వాణిజ్య ప్రాంగణాలు, మెరీనా, ఎలియట్స్, కాశిమేడులోని సముద్రతీరాలు, హిందూ దేవాలయాలు, మసీదులు, చర్చిలు ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తారు. ఇవి కాకుండా నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, శివారు ప్రాంతాల్లోని రిసార్టుల్లో బుధవారం నుండి తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, బహిరంగ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా పార్కింగ్ చేసిన వాహనాల గురించిన సమాచారాన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తెలియజేయాల్సిందిగా నగర ప్రజలకు పిలుపునిచ్చారు.

వారంతా వలసపక్షులు



మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

- అన్వర్‌రాజా, మైత్రేయన్‌పై ఈపీఎస్ విసుర్లు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీలో పదవులు అనుభవించి, అవసరం తీరాక డీఎంకేలో చేరేవారంతా వలసపక్షులేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)విమర్శించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం'అనే నినాదంతో గత నెల 7వ తేదీ కోవై జిల్లా మేట్టుపాళయంలో ప్రారంభమైన ఈపీఎస్ ప్రచారయాత్ర బుధవారం తిరుపత్తూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎంపీలు అన్వర్‌రాజా, మైత్రేయన్‌లను పార్టీ నుంచి తొలగించడంపై విలేఖర్లు అడిగిన ప్రశ్నకు ఈపీఎస్ సమాధానమిస్తూ, పార్టీ నిబంధనలను అతిక్రమించిన వారిని పార్టీ నుంచి తొలగించడం, క్షమాపణ చెప్పిన తర్వాత మళ్ళీ చేర్చుకోవడం రాజకీయాల్లో కొత్తకాదన్నారు. పార్టీ నిబంధనలకు కట్టుబడకుండా యధేచ్ఛగా వ్యవహరించినందువల్లే అన్వర్‌రాజా, మైత్రేయన్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఎవరు ఏ పార్టీలోనైనా చేరే హక్కుందని, ఒక్కో పార్టీకి ఒక్కో రకమైన నిబంధనల ప్రకారమే పార్టీని ముందుకు తీసుకెళ్తుంటామన్నారు. పార్టీలో, ప్రభుత్వంలో పదవులు అనుభవించి అన్నివిధాలా లబ్ధిపొందినవారెంతో మంది అన్నాడీఎంకేకు వెన్నుపోటు పొడిచి ఇతర పార్టీల్లో చేరారని, అయితే అలాంటివారిలో కొంతమంది మాత్రమే ఆయా పార్టీల్లో గుర్తింపు పొందారని, మిగతావారు ఏమైపోయారో కూడా తెలీదన్నారు. అన్వర్‌రాజా మైత్రేయన్‌లను రెండుసార్లు పార్టీ నుండి తొలగించామని, వారు క్షమాపణ చెప్పడంతో మళ్ళీ పార్టీలో చేర్చుకున్నామని, ఇలాంటి వలసపక్షులు ఎక్కడా నిలకడగా ఉండలేరన్నారు. అన్నాడీఎంకే-బీజేపీ కూటమిలో మరికొన్ని పార్టీలు చేరే అవకాశముందని, 8 నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ద్వారా వచ్చే ఏడాది రాష్ట్రంలో అధికారం మారుతుందని ఆయన నమ్మకం వ్యక్తంచేశారు. తిరుపత్తూరు జిల్లాలోని రైతులు, పాఠశాల విద్య, ప్రైవేటు బస్సులు తదితర సంఘాల ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తనకు తెలిపారని, అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారి కోరికలతో పాటు సాగు కాలువల్లో పూడికతీయించి సాగునీటిని సరఫరా చేసే చర్యలు చేపడుతామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో డీఎంకే ప్రభుత్వం సుమారు 50 కొత్త పథకాలను ప్రకటించిందని, వాటికి ప్రత్యేక కమిటీలను కూడా నియమించిందని, అయితే ఆ కమిటీలు పనిచేయడంలేదని ఈపీఎస్ ఆరోపించారు. ఈపీఎస్‌తో మాజీమంత్రి కేసీ వీరమణి, ఎంపీ తంబిదురై తదితరులున్నారు.

సమాచార దర్శిని

'తెలుగు సినిమాల్లో మనసు పాటలు'పై 31న రామసుబ్బారెడ్డి ప్రసంగం

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 'తెలుగు సినిమాలలో మనసు పాటలు' అనే అంశంపై విజయవాడకు చెందిన రచయిత, ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ప్రసంగించనున్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 164వ ప్రసంగ కార్యక్రమం టి.నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఈ నెల 31 ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీప్రియులందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

16న ఆంధ్రకళా స్రవంతిలో కృష్ణాష్టమి వేడుకలు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు అగ్రహారంలోని ఆంధ్రకళా స్రవంతి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ శనివారం కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోనున్నారు. 'కృష్ణం వందే జగద్గురుమ్' పేరుతో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేణుగానం, కోలాటం, మయసభ, వీణానాదం, పాటలు, ఆటల పోటీలు, శ్రీకృష్ణ భక్తిగీతాలు, సంగీత విభావరి కార్యక్రమాలు జరుగుతాయని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు.

జిల్లా కేంద్రాల్లో టైడల్ పార్కు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో టైడల్ పార్కు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. టిడ్కో అనే తమిళనాడు పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఎల్కాట్ అనే తమిళనాడు ఎలక్ట్రానిక్ సంస్థలు సంయుక్తంగా తరమణిలో 2000వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన టైడల్ పార్కు ద్వారా రాష్ట్రంలో ఐటీ ఉద్యోగావకాశాలు పెరిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని జిల్లాల్లో మినీ టైడెల్ పార్కులను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

సీఐఎస్ఎఫ్‌లో అడ్మిషన్లు ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో అడ్మిషన్లు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రారంభించినట్లు బుధవారం ఆ విభాగం అధికారులు తెలిపారు. ప్యారా మిలిటరీ విభాగంలో ప్రతిఏటా 14వేల మందిని చేర్చుకునేందుకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

14,15 తేదీల్లో డ్రోన్ల నిషేధం

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రతా చర్యల్లో భాగంగా ఈ నెల 14, 15వ తేదీల్లో రాజధాని నగరంలో డ్రోన్లు ఎగురవేసేందుకు నిషేధం విధించినట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ ఎ.అరుణ్ ప్రకటించారు. సచివాలయం నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ నివసించే ప్రాంతాలకు వెళ్లే రహదారులను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో రిమోట్ ద్వారా పనిచేసే డ్రోన్లు, మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్, ప్యారా గ్లైడర్స్, ప్యారా మోటార్స్, హాట్ ఎయిర్ బెలూన్లను గురు, శుక్రవారాల్లో ఎగురవేయరాదని పోలీస్‌శాఖ హెచ్చరించింది.

16న నలంకాక్కుమ్ స్టాలిన్ శిబిరం రద్దు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శనివారం రోజు నలంకాక్కుమ్ స్టాలిన్ శిబిరాలను రద్దు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ బుధవారం ప్రకటించింది. ప్రతి శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న నలంకాక్కుమ్ స్టాలిన్ పథకం ద్వారా ఇప్పటివరకు 92,836 మంది లబ్దిపొందారు. శనివారం కృష్ణాష్టమి సందర్భంగా ఆ రోజు ఈ శిబిరాన్ని రద్దు చేసినట్లు ప్రకటించింది. 38 జిల్లాల్లో ఈ నెల 23న శిబిరాలు పున ప్రారంభమవుతాయని ఆరోగ్య శాఖ తెలిపింది.

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంపు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 17వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టరేట్ ప్రకటించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను ఈ సంస్థ మూడోసారి పొడిగించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. తొలి విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు కళాశాలల ఎంపిక చేసుకునే అవకాశం మంగళవారంతో ముగిసిన నేపథ్యంలో, 16వ తేదీ వరకు గడువు పొడిగించింది. 17న సీట్లు కేటాయించి 18న తుది విడత జాబితా విడుదలవుతుంది. కేటాయించిన కళాశాలల్లో చేరే ఉత్తర్వులను ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టరేట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు.

నేరాల నియంత్రణకు 3.2 లక్షల సీసీ కెమెరాలు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిఘా తక్కువవున్న ప్రాంతాల్లో నేరాలు పసిగట్టేందుకు 3.2 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పోలీసుశాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం 1,300 లకు పైగా ఉన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో భద్రతా లోపం ఉన్న ప్రాంతాలపై ఇటీవల పోలీస్‌శాఖ సర్వే నిర్వహించింది. ఈ ప్రాంతాల్లో దారిదోపిడి, చైన్‌స్నాచింగ్, తదితర నేరాలకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు తాత్కాలిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. తరచూ నేరాలు జరిగే ప్రాంతాల్లో ప్రజలను హెచ్చరిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నారు.తొలివిడతగా 820 పోలీస్‌స్టేషన్లలో 18నెలల వరకు ఆయా ప్రాంతాల్లో జరిగే సంఘటనలు రికార్డు చేసేలా సీసీ కెమెరాల ఏర్పాటు పనులు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మలి విడతగా మరో 251 పోలీస్ స్టేషన్లలో ఇవి ఏర్పాటు చేయనున్నారు. ఈ రకంగా రాష్ట్ర వ్యాప్తంగా 65వేల ప్రాంతాల్లో 3.2 లక్షల సీసీటీవీ కెమెరాలు పొందుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి కోసం స్పీకర్ కారు ముట్టడి

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా దిసైవిళై వద్ద స్థానికులు అసెంబ్లీ స్పీకర్ అప్పావు కారును ముట్టడించారు. బుధవారం ఉదయం ఓ ప్రభుత్వ కార్యక్రమానికి అప్పావు కారులో వెళుతుండగా దిసైవిళై ప్రాంతానికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో ప్రదర్శనగా వచ్చి రోడ్డుపై బైఠాయించారు. తమకు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దిసైవిళై పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు జాన్సీరాణి ఆందోళనకు నాయకత్వం వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని బలవంతంగా అక్కడి నుండి తొలగించారు.

టీవీకే మహానాడుకు భారీ ఏర్పాట్లు

● లక్షమందికి సీటింగ్ సదుపాయం


సభా వేదిక నిర్మిస్తున్న కార్మికులు

టి.నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) మదురైలో ఈ నెల 21న నిర్వహించనున్న రెండో మహానాడుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. పార్టీ కార్యకర్తలకోసం ప్రాథమిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పార్టీ నిర్వాహకులు పోలీసులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం మదురై సమీపంలోని పారాపత్తి వద్ద 500 ఎకరాల మైదానంలో మహానాడు వేదిక, పందిరి నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. పార్టీ అధ్యక్షుడు విజయ్ సభావేదిక ప్రాంతం నుండి కార్యకర్తల వైపు నడచి వెళ్లటానికి వీలుగా వెయ్యి అడుగుల పొడవైన ప్రత్యేక వేదిక కూడా నిర్మిస్తున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మహానాడు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ మహానాడుకు వచ్చే పార్టీ కార్యకర్తల కోసం చేస్తున్న ఏర్పాట్లపై మదురై జిల్లా పోలీసులు ప్రశ్నించగా, దానికి పార్టీ నిర్వాహకులు ఓ లేఖ సమర్పించారు. ఆ ప్రకారం ఈ మహానాడుకు 1.20 లక్షల మంది పురుషులు, 25 వేలమంది మహిళలు, 4500 మంది వృద్ధులు, 500 మంది దివ్యాంగులు రానున్నారు. ఈ మహానాడులో పాల్గొనేందుకు చిన్నారులు, గర్భిణులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సభా వేదిక ముందు లక్ష కుర్చీలతో సీటింగ్ ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొనేందుకు వచ్చే పార్టీ శ్రేణులెవరికీ ప్రత్యేకంగా టికెట్లు ఇవ్వలేదని, సభా వేదిక ప్రాంతానికి సులువుగా చేరేలా 18 మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల భద్రత కోసం మహిళా వలంటీర్లను కూడా నియమిస్తున్నట్లు తెలిపారు. మహానాడు ప్రాంతంలో 400లకు పైగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సదుపాయం కూడా కల్పిస్తున్నామని వివరించారు. మహానాడుకు చేరువగా మూడు చోట్ల వాహనాల పార్కింగ్ కల్పిస్తున్నారు. మహానాడుకు అవసరమైన విద్యుత్ కోసం భారీ జనరేటర్లను ఉపయోగించనున్నామని, మహానాడు వేదిక వద్ద 20 వేల విద్యుత్ లైట్లు, అవసరమైనంత మేరకు సీసీ కెమెరాలు అమర్చుతామన్నారు. టీవీకే మదురై తూర్పు జిల్లా శాఖ కార్యదర్శి కల్లానై మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సూచనల ప్రకారం మహానాడు ఏర్పాట్లు 80 శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు.

23 నుంచి 25 వరకు ఈపీఎస్ పర్యటన వివరాలు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు పర్యటించే ప్రాంతాల వివరాలను అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం బుధవారం విడుదల చేసింది. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంలో ఈపీఎస్ రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా శనివారం తిరువెరంబూరు, తిరుచ్చి ఈస్ట్, లాల్గుడి ప్రాంతాల్లో, 24న మనచ్చానల్లూరు, తురయూర్, ముసిరి ప్రాంతాల్లో 25 సోమవారం మనప్పారై, తిరుచ్చి వెస్ట్, శ్రీరంగం నియోజక వర్గాల్లో ఈపీఎస్ ప్రచారయాత్ర కొనసాగనున్నట్లు అన్నాడీఎంకే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఉంగళుడన్ స్టాలిన్ పథకంతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం


ఉంగళుడన్ స్టాలిన్ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, డీఎంకే నేతలు

వేలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా తోరపాడి యూనియన్ పరిధిలోని కల్యాణమండపంలో బుధవారం ఉదయం 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాన్ని ఆ జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎంకే ఎమ్మెల్యే కార్తికేయన్, వేలూరు మేయర్ సుజాత పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని, రాష్ట్రాభివృద్ధికి కోసం సీఎం స్టాలిన్ నేతృత్వంలోని నేతలంతా కూడా ప్రజలకు అందుబాటులో వుంటూ ఎప్పటికప్పుడు ప్రజల అభ్యర్థలకు, సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్నారు. అనంతరం ప్రజల వద్ద వినతిపత్రాలను అందుకున్న వారు సకాలంలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

పోలీసు భద్రత కోరిన అజిత్ న్యాయవాది

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): లాకప్‌డెత్‌కు గురైన శివగంగ జిల్లా తిరుభువనంలోని మడప్పురం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ న్యాయవాది కార్తిక్ రాజా తనకు హత్యా బెదిరింపులు వస్తున్నాయని, తమ కుటుంబానికి పోలీసు భద్రత కల్పించాలని న్యాయస్థానంలో మొరపెట్టుకున్నారు. ఓ చోరీ కేసు విచారణ నిమిత్తం జూన్ 28న పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణలో మరణించిన అజిత్‌కుమార్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలంరేపిన విషయం తెలిసిందే. ఈ నెల 12 నుండి సీబీఐ ఈ కేసు విచారణ జరుపుతునన నేపథ్యంలో ఈ కేసులో ప్రధాన సాక్షులు, ఆలయ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, శక్తీశ్వరన్, అజిత్‌కుమార్ సోదరుడు నవీన్‌కుమార్, మిత్రుడు అరుణ్‌కుమార్ గత నెల 29న కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పారు. బుధవారం మళ్ళీ ఈ కేసు హైకోర్టు మదురై బెంచ్ ముందుకు విచారణకు రాగా, అజిత్‌కుమార్ తరుపున న్యాయవాది కార్తిక రాజా హాజరై ఈ కేసు నుండి వైదొలగాలని కొంత మంది తనను బెదిరిస్తున్నారని, అందువల్ల తనకు, తన కుటుంబానికి పోలీసు భద్రత కల్పించాలని అభ్యర్థించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక దాఖలు చేయాల్సిందిగా జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశించింది. ఇదిలా వుండగా, ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు పోలీసుల రిమాండ్‌ను న్యాయస్థానం మూడోసారి పొడిగించడం గమనార్హం.

పీఎంకే సీనియర్లతో రాందాస్ సమాలోచన

అడయార్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఈ నెల 17న సర్వసభ్యమండలి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఆ ఏర్పాట్లలో భాగంగా పార్టీ సీనియర్ నేతలతో ఆయన సమాలోచన చేశారు. ఈ సమావేశానికి పార్టీ గౌరవ అధ్యక్షుడు జీకే మణి, పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శి అన్బళగన్, పరంథమన్ తదితరులు హాజరయ్యారు. పార్టీ సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సిన అంశాలతో పాటు చేయాల్సిన తీర్మానాలపై వారు చర్చించారు.

ఆస్తి పన్ను విధించడంలో అక్రమాలు

● మదురై మేయర్ భర్త సహా ఇద్దరి అరెస్టు


పొన్‌వసంత్ - సురేష్‌కుమార్

టి.నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను విధింపులో జరిగిన అవినీతి అక్రమాలకు సంబంధించి మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్ సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ అవినీతి కేసులో అరెస్టయిన నిందితుడు కన్నన్ ఇచ్చిన వాంగ్మూలం మేరకు పొన్‌వసంత్, కార్పొరేషన్‌లో ప్రతిపక్షనేత సోలైరాజా మరో ముగ్గురు కార్పొరేటర్లు కుమ్మక్కై ఈ అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో దిగ్భ్రాంతికి గురైన అన్నాడీఎంకే శ్రేణులు మాజీ మంత్రి సెల్లూరు కే రాజు నాయత్వంలో డీఐజీ అభినవ్‌కుమార్‌ను కలిసి మదురై కార్పొరేషన్‌లో జరిగిన ఆస్తిపన్ను క్రమాలపై విచారణ జరుపుతున్న అధికారులను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో కన్నన్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ఆసక్తికరంగా మలుపు తిప్పింది. ఈ నేపథ్యంలో మదురై మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్‌ను మంగళవారం రాత్రి చెన్నైలో అరెస్టు చేశారు. మేయర్‌గా ఉన్న భార్య పలుకుబడితో పొన్‌వసంత్ ఆస్తి పన్నుల విధింపులో భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడినట్లు చెబుతున్నారు. తనకు భారీగా ముడుపులు చెల్లించినవారికి ఆస్తిపన్ను తక్కువగా, ముడుపులు చెల్లించని వారికి ఎక్కువగాను వేశారని, ఈ అవినీతికి అన్నాడీఎంకే శ్రేణులు కూడా సహకరించినట్లు తెలుసుకుని ఆ పార్టీ నేతలు దిగ్భ్రాంతి చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఈ అవినీతి అక్రమాలతో సంబంధం ఉన్న గతంలో మదురై కార్పొరేషన్‌లో పనిచేసి ప్రస్తుతం తూత్తుకుడి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ (జమాపద్దులు) సురేష్‌కుమార్ (59)ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. సురేష్‌కుమార్ హయాంలో మదురై ఏయే సంస్థలకు, వ్యక్తులకు చెందిన భవనాలకు తక్కువగా పన్నులు విధించారనే వివరాలను అధికారులు సేకరించే పనిలో పోలీసు ఉన్నతాధికారులు తలమునకలవుతున్నారు.

పాలిటెక్నిక్‌లో పేలిన నాటుబాంబు

● ఇద్దరు విద్యార్థులకు గాయాలు


బాంబు పేలిన మెకానికల్ విభాగం

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఓ విద్యార్థి తీసుకొచ్చిన నాటు బాంబు పేలడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుచెందూరు సమీపం ఆరుముగనేరి ప్రాంతానికి చెందిన వెంకటేష్ ఆ కళాశాలలో మెకానికల్ సెకండియర్ చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం వెంకటేష్ తన స్నేహితుడి ఊరిలో జరిగిన ఆలయ ఉత్సవాలకు వెళ్ళాడు. ఆ ఉత్సవాల్లో నాటుబాంబులు తయారు చేసి పేల్చటాన్ని గమనించాడు. అతడి వద్ద ఓ నాటు బాంబు అడిగి తీసుకుని తన సంచిలో ఉంచుకుని స్వస్థలానికి చేరుకున్నాడు. మంగళవారం ఉదయం ఆ నాటు బాంబున్న సంచిలోనే పుస్తకాలుం పెట్టుకుని వెంకటేష్ కళాశాలకు వచ్చాడు. తరగతిగదిలోకి వెళ్ళిన తర్వాత వెంకటేష్ అదే పనిగా సంచిలోని నాటుబాంబును ఆసక్తి గమనిస్తుండడం చూసిన తోటి విద్యార్థులు మాధవన్, మురళికార్తీక్ ఆ సంచిని లాక్కుని అందులోని నాటుబాంబును చేతుల్లోకి తీసుకుని ఆటలాడారు. వెంకటేష్ నాటు బాంబును తీసుకునేందుకు ప్రయత్నించినా వారు పట్టించుకోలేదు. ఆలోగా విద్యార్థులు సంచిని లాగుతుండటంతో నాటుబాంబు వత్తిపై ఒత్తిడి పెరిగి అది పేలింది. ఈ సంఘటనలో మాధవన్ కుడిచేయికి, మురళికార్తీక్ కంటి దిగువన గాయాలయ్యాయి. నాలుబాంబు పేలుడు శబ్దం విని విద్యార్థులు, అధ్యాపకులు భీతిల్లారు. ఆ తర్వాత గాయపడిన ఇద్దరు విద్యార్థులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై తెన్‌పాక్కం పోలీసులు కేసు నమోదు చేసుకుని తీవ్ర విచారణ జరుపుతున్నారు. ఆ కళాశాలలో బాంబు పేలిందని తెలియటంతో విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడకు చేరారు. చివరకు ఆ నాటుబాంబు బాణసంచా రకానికి చెందినదని తెలియటంతో ఊరట చెందారు.

ఘనంగా మరుదుపాండియార్ల విగ్రహావిష్కరణ


మరుదుపాండియార్ల విగ్రహాలను విష్కరిస్తున్న పీఎన్‌కే పార్టీ అధ్యక్షుడు షణ్ముగం

వేలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పుదియ నీతి కట్చి (పీఎన్‌కే) రాష్ట్ర అధ్యక్షుడు ఏసీ షణ్ముగం ఆధ్వర్యంలో బ్రిటీష్ వారి గుండెల్లో వణుకుపుట్టించిన వీరసోదరులు మరుదుపాండియార్ల విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం చిత్తూరులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ, తమిళ గడ్డపై ఈస్ట్ ఇండియా కంపెనీని వణుకుపుట్టించిన మహావీరులు మరుదుపాండియార్ సోదరులని కొనియాడారు. బుల్లెట్ సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమిళ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాండ్య వంశీయులు పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై చర్యలు తీసుకోండి

● పోలీసులకు నటి షకీలా ఫిర్యాదు

అడయార్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పరువు హత్యలను ప్రోత్సహిస్తున్నట్టుగా తనపై ఆరోపణలు చేసిన యూట్యూబర్ దివాకర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సినీ నటి షకీలా ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ, గత నెల 27న తిరునెల్వేలి జిల్లాలో పరువు హత్య జరిగిందన్నారు. ఈ హత్యను సమర్థించేలా దివాకర్ ఓ వార్త ప్రచురించడంతో పాటు ఆయన సామాజిక వర్గాన్ని సమర్థించేలా ప్రసంగించారని ఆమె పేర్కొన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు సమాజంలో పరువు హత్యలను ప్రోత్సహించేలా ఉన్నాయని, అందువల్ల ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జాయింట్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. అలాగే, ఇతర వర్గాలకు కించపరిచేలా మాట్లాడినందుకు యూట్యూబర్ దివాకర్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని షకీలా డిమాండ్ చేశారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొన్న కారు

● 9నెలల పసికందు సహా ముగ్గురి దుర్మరణం


ప్రమాదానికి గురైన కారు

తిరుత్తణి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపటు సమీపంలోని తిరుమలరాజుపేట జాతీయ రహదారిలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని మంగళవారం ఉదయం కారు ఢీకొన్న ప్రమాదంలో 9నెలల పసికందు సహా ముగ్గురు మృతి చెందారు.. వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు తాలూకాలోని గోవిందరెడ్డిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు సురేంద్రరెడ్డి కుటుంబ సభ్యులైన విశ్వనాథన్ (50), అతడి భార్య రేఖ (45), కుమార్తె కీర్తి (25), చిట్టెమ్మ (52), పద్మ (60), కీర్తి 9నెలల చిన్నారి సాన్విక్ సహా మొత్తం ఆరుగురు తిరుత్తణి మురుగన్ దర్శనానికి కారులో వెళ్తుండగా, పళ్లిపటు సమీపంలోని తిరుమలరాజుపేట జాతీయ రహదారిలో అక్కడ నిర్మాణంలో ఉన్న వంతెనను కారు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదాన్ని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని రాణిపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో 9నెలల పసికందు సాన్విక్ సహా రేఖ, పద్మ అనే వారు మృతిచెందారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దీనిపై దర్యాప్తు చర్యలు చేపట్టారు.

పశువును ఢీకొన్న వందేభారత్

● రైలు ముందుభాగం ధ్వంసం


ధ్వంసమైన రైలు ముందుభాగం

టి.నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విరుదాచలం వద్ద పట్టాలు దాటుతున్న పశువును ఢీకొన్న వందేభారత్ రైలు ముందు భాగం ధ్వంసమైంది. బుధవారం ఎగ్మూరు నుంచి తిరునల్వేలి వెళ్తున్న వందేభారత్ రైలు విరుదాచలం సమీపం మనలూరు వద్ద వెళ్తుండగా పట్టాలను దాటేందుకు ప్రయత్నిస్తున్న పశువును రైలు ఢీకొంది. ఈ సంఘటనలో రైలు ముందుభాగంలోని ఏరోడైనమిక్ ప్రాంతం పూర్తిగా ధ్వంసమైంది. రైలు ఢీకొనటంతో ఆ పశువు మరణించింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని పశువుల కాపరి శివకుమార్‌ను అరెస్టు చేశారు.

బల్లిపడిన అల్పాహారం తిని

8 మంది విద్యార్థులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్ద తల్లిదండ్రులు, పోలీసులు

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా వలంగైమాన్ వద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉదయం అల్పాహార పథకం కింద సరఫరా చేసిన కిచెడీ, సాంబరులో బల్లి పడి ఉండటంతో విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. వీరిలో ఎనిమది మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వలంగైమాన్ సమీపంలోని అలంగుడి పూనాయిరుప్పు గ్రామంలో ప్రభుత్వ పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల నడుపుతున్నారు. బుధవారం ఉదయం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఆ సమయంలో కొందరు విద్యార్థులు సాంబర్‌లో బల్లి పడి ఉండటం చూసి వెంటనే వాంతులు చేసుకున్నారు. తక్కిన విద్యార్థులు వెంటనే ఆ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయులు వెటనే వాంతులు చేసుకున్న ఎనిమిది మంది విద్యార్థులను అలంగుడి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం కుంభకోణం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● బస్సు కండక్టర్ అరెస్ట్

వేలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని ఓ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రభుత్వ బస్సు కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ అరెస్టు చేశారు. వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని జలగలపల్లికి చెందిన గాంధీవన్ అనే బస్సు కండక్టర్ మంగళవారం రాత్రి కళాశాల నుండి ఇంటికి వెళ్తున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నిందితుడిని 24 గంటల్లోనే అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రైలు కిందపడి ఆడిటర్ భార్య ఆత్మహత్య

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఆడిటర్ భార్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘన చెంగల్పట్టు జిల్లా కొత్తేరి రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. అన్నానగర్‌కు చెందిన గోకుల్ అనే ఆడిటర్ భార్య భారతి (45) సైదాపేటలోని ఓ కంపెనీలో పని చేస్తోంది. బుధవారం ఉదయం పొత్తేరి ప్రాంతంలోని తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడిన భారతి అనంతరం పొత్తేరి రైల్వేస్టేషన్‌లో కూర్చునట్లు తెలిసింది. 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌లో కూర్చున్న ఆమె హఠాత్తుగా పట్టాలపై పడుకోవడం, ఆ సమయంలోఎగ్మూర్ నుండి తంజావూరు బయలుదేరిన గూడ్స్ రైలు ఆమెపై నుండి వెళ్లింది. ఈ ప్రమాదంలో భారతి మృతిచెందినట్లు దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

వేలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సెలవన్‌పేటలోని తిరువీకానగర్‌లో బుధవారం ఉదయం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాలిలా.. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న పచ్చయప్పన్ రెండేళ్ల క్రితం మృతిచెందగా, కుటుంబ భారమంతా అతడి కుమారుడు దామోదరన్ (22)పై పడింది. దీంతో అతను కూడా భవన నిర్మాణం పనులకు వెళ్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం దామోదరన్ తాను పనిచేస్తున్న ఓ భవనంలోనే శవమై పడివుండటం గమనించిన ఆ భవన యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెళ్లి దామోదరన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, దీనిపై కేసు నమోదు చేసి దామోదరన్‌ది హత్యా? లేక ఆత్మహత్యా? అనే కోణంలో దర్యాప్తు చర్యలు చేపట్టారు.

కుక్క కాటుతో 20 మంది మృతి

పెరంబూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి 1వ తేది నుంచి ఆగస్టు 10వ తేది వరకు 3,67,604 మంది కుక్క కాటుకు గురికాగా, వారిలో 20 మంది మృతిచెందారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా 8 వారాల్లో వీధి కుక్కలను నియంత్రించాలనే సుప్రీంకోర్టు ఉత్తర్వులతో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం సచివాలయంలో పశుసంవర్థక శాఖ కార్యదర్శి సుబ్బయ్యాన్, డైరెక్టర్ కన్నన్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, పశుసంవర్థక శాఖ తెలిపిన వివరాల ప్రకారం, రాష్ట్రంలో 4.5 లక్షల వీధి శునకాలు, 4.5 లక్షల పెంపుడు శునకాలున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 10వ తేది వరకు 3,67,604 మంది కుక్కకాటుకు గురికాగా, వారిలో 20 మంది మృతిచెందారు. అదే సమయంలో, గత ఏడాది (2024)లో 4,80,483 మంది కుక్కకాటుకు గురికాగా, 43 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్రంలో కుక్కల నియంత్రణకు చేపట్టనున్న చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో కరాటే మాస్టర్‌కు పదేళ్ల జైలు శిక్ష


కెబిరాజ్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం ప్రైవేటు పాఠశాలలో కరాటే శిక్షకుడిగా పనిచేస్తూ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన అన్నానగర్ కరాటే శిక్షణా సంస్థ నిర్వాహకుడు కెబిరాజ్‌కు మహిళా న్యాయస్థానం పదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. 2021లో ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినులకు నిందితుడు కరాటే నేర్పేవాడు. ఆ సందర్భంగా ఓ విద్యార్థినిపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ విషయాన్ని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయనను అరెస్టు చేశారు. అదే సమయంలో మరికొంత మంది విద్యార్థినులు కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఫిర్యాదులు చేశారు. అన్ని ఫిర్యాదులను నమోదు చేసుకుని పోలీసులు విచారణ జరిపారు. ఈ కేసుపై విచారణ జరిపిన నగరానికి చెందిన మహిళా కోర్టు ఆయనకు పదేళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

కాలువలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం

వేలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు కోట ప్రాంగణంలోని కాలువలో బుధవారం ఉదయం లభించిన గుర్తుతెలియని యువకుడి మృతదేహంపై పోలీసులు విచారణ చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం వేలూరు కోట ప్రారంగణంలోని కాలువలో పడిఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి మృతుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

సూపర్‌స్టార్‌ను నేనూ అభినందిస్తున్నా

● కమల్ హాసన్ ● 50 ఏళ్ల 'రజనీయిజం' ● సినీ ప్రముఖుల ప్రశంసలు


రజనీతో కమల్

చిత్రజ్యోతి

అడయార్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రపరిశ్రమలోకి ప్రవేశించి 50 యేళ్ళు పూర్తయిన సందర్భంగా చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా అగ్రనటుడు కమల్ హాసన్ తన ఎక్స్ ఖాతాలో 'మన సూపర్ స్టార్‌ను నేనూ అభినందిస్తున్నాను' అంటూ పోస్ట్ చేశారు. 'సినిమాలో అర్థ శతాబ్దం అనేది అద్భుతమైనది. నా ప్రియ స్నేహితుడు రజనీకాంత్ సినిమాలో స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకుంటున్నారు. మన సూపర్‌స్టార్‌ను నేను కూడా ప్రేమతో, అభిమానంతో అభినందిస్తున్నాను. ఈ గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్న తరుణంలో ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న 'కూలీ' చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్ సాధించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను' అని పేర్కొన్నారు. అలాగే, 'కూలీ' డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, 'నా సినీ కెరీర్‌లో 'కూలీ' మూవీ ఎంతో ప్రత్యేకమైనది. రజనీకాంత్ చేరగానే ప్రతి ఒక్కరూ ఎంతో ప్రేమాభిమానాలను చూపించారు. ఈ సినిమా అద్భుతంగా రావడానికి ఇదొక కారణం. ఈ అవకాశం ఇచ్చినందుకు ఎన్నటికీ రుణపడివుంటాను. మీతో కలిసి పంచుకున్న అమూల్యమైన విషయాలను జీవితాంతం గుర్తుండిపోతాయి. మమ్మల్ని అంతగా ప్రోత్సహించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. '50 యేళ్ళు - ఒక సింహాసనం - ఒకే వ్యక్తి. తలైవర్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను సెలెబ్రేట్ చేసుకుందాం' అంటూ చిత్ర సంగీత దర్శకుడు అనిరుధ్ పిలుపునిచ్చారు. సినీ నటి, తమిళనాడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూ మాట్లాడుతూ, 'మీరు ఈ రోజు ఈ స్థితిలో ఉన్నారంటే అంకితభావం, నిబద్ధత, వృత్తినైపుణ్యం ఎంతో అవసరం. భారతీయ తెరపై ఇంతకుముందు, ఇక తర్వాత మీలాంటి స్టార్ ఎపుడూ లేరు. మీరు ప్రత్యేకమైన వ్యక్తి. మీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను జరుపుకోవడం ఆనందంగా.. 50వ వార్షిక శుభాకాంక్షలు' అంటూ పేర్కొన్నారు. '50 యేళ్ళపాటు ఒకే రంగంలో అగ్రస్థానంలో ఉండటం అరుదైన విషయం. మీ కీర్తి ప్రతిష్టలు మరింతగా పెరుగుతూనే ఉండాలని కోరుకుంటున్నానని ప్రముఖ గేయ రచయిత వైరముత్తు ట్వీట్ చేశారు. 'ముత్తు' చిత్రం కోసం రాసిన 'యవ్వనం ఎప్పటికీ విడిచిపెట్టదు.. వృద్ధాప్యం నాకు రాదు' అనే వాక్యంతో మిమ్మలను అభినందిస్తున్నాను అని పేర్కొన్నారు. అలాగే సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ కూడా శుభాకాంక్షలు తెలిపారు.


రజనీ - ఖుష్బూ

తెలుగు పద్య పఠనంతోనే భాషపై పట్టు సాధించగలం

● కమలాకర రాజేశ్వరి


అతిథులను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు పద్యం ఎంతో హృద్యంగా ఉంటుందని, పద్య పఠనంతో భాష మీద పట్టు, నైపుణ్యం అలవడుతుందని విశ్రాంత అధ్యాపకులు, న్యూఢిల్లీలోని ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్స్ కోఆర్డినేటర్ కమలాకర రాజేశ్వరి పేర్కొన్నారు. పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావుబహదూర్ కలవల కన్నన్‌చెట్టి ఎ హిందూ కళాశాల తెలుగుశాఖలో 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి తెలుగు భాషా సమితి ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆగస్టులో తెలుగు మహనీయులైన పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ, శంకరంబాడి సుందరాచారి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతులను పురస్కరించుకుని వారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమలాకర రాజేశ్వరి 'తెలుగు పద్య పఠనంలో భాషా నైపుణ్యాలు' అనే అంశంపై ప్రసంగిస్తూ భాషా నైపుణ్యాలు అంటే శ్రవణం, సంభాషణం, పఠనం, లేఖనం, అని తెలిపారు. పద్య పఠనంలో ఇవన్నీ చాలా ముఖ్యమని ఆదికవి నన్నయ నుంచి ఆధునిక కవులైన కరుణశ్రీ సాహిత్యం వరకు ఉన్న ఆణిముత్యాల్లాంటి పద్యాలను పాడుతూ, వాటిలోని ఔచిత్యాలను వివరించారు. అనంతరం ఆమె చేతుల మీదుగా శతక పద్యాల్లోని భాషా నైపుణిని ఆవిష్కరించారు. ముందుగా కీర్తన, అల్లు కుమారి, అశ్విని బృందం ప్రార్థనాగీతంతో మొదలైన ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ సురేష్ స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల ప్రధాన అధ్యాపకులు డా.జి.కల్విక్కరసి ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సత్కరించారు. తెలుగుశాఖ అధ్యాపకులు డా.తుమ్మపూడి కల్పన అతిథిని పరిచయం చేస్తూ కళాశాలలో తెలుగు విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకపై కళాశాలలో తెలుగుశాఖలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.. తెలుగుశాఖ విద్యార్థులు బాబు, కుమారి వ్యాఖ్యాతలుగా వ్యవహరించగా, షిఫ్ట్-2కి చెందిన తెలుగుశాఖ అధ్యాపకురాలు డా.ప్రమీల వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో కమలాకర ఆనంద శివరామ్, ఇతర శాఖలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనేక గుణపాఠాలు నేర్చుకున్నా

హన్సికా మొత్వానీ

ఈ యేడాది అనేక గుణపాఠాలను నేర్చుకున్నట్టు ప్రముఖ హీరోయిన్ హన్సికా మొత్వానీ అన్నారు. ఈ నెల 9వ తేదీ ఆమె తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేసమయంలో ఈ యేడాది అనేక గుణపాఠాలు నేర్చుకున్నాను. పైగా నాకు తెలియకుండానే నాలోని శక్తిని గ్రహించాను' అంటూ వ్యాఖ్యానించారు. కాగా, హన్సికా తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇపుడు చర్చనీయాంశంగా మారాయి. 2022లో సోహైల్ కటారియాను ప్రేమించి వివాహం చేసుకున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం తమిళం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా గడుపుతున్నారు.



సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దుదాం

● ఎస్‌కేడీటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దుదామనే నినాదంతో విల్లివాక్కంలోని శ్రీ కనకదుర్గా తెలుగు పాఠశాల (ఎస్‌కేడీటీ) ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్‌కేడీటీ మహోన్నత, పాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 250 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విల్లివాక్కం ట్రాఫిక్ పోలీసు అధికారులు డి.రమేష్, సెల్వరాజ్, సురేష్, లత తదితరులు మాదకద్రవ్యాల కారణంగా సమాజానికి, యువతకు కలిగే ముప్పు వివరిస్తూ ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్‌కేడీటీ విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ సీఎం కిషోర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని నమో గాడ్ ట్రస్ట్ తరుపున వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుదామనే నినాదంతో ర్యాలీ, వైద్యశిబిరం, అనాథాశ్రమాల్లో అన్నదానం చేశారు. ఎస్‌కేడీటీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో 706 మంది విద్యార్థిని, విద్యార్థులకు టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని ప్రొక్యూర్ హెల్త్ కేర్ వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.నందగోపాల్, డాక్టర్ ఎన్.నాగభూషణం, ప్రధానోపాధ్యాయురాలు కె.శారా సుహాసిని, ఏహెచ్‌ఎం అళగర్ రాజ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రేణుక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఉదయనిధి, రజనీకాంత్, లత

తలైవర్ నటించిన టాప్ చిత్రాల్లో 'కూలీ' ఒకటి

● లతా రజనీకాంత్

ఇప్పటివరకు తలైవర్ రజనీకాంత్ నటించిన టాప్ చిత్రాల్లో 'కూలీ' ఒకటిగా నిలుస్తుందని సూపర్‌స్టార్ రజనీకాంత్ సతీమణి లత అన్నారు. 'కూలీ' చిత్రం గురువారం ప్రపంచ వ్యాప్తంగా పాన్ ఇండియా మూవీగా విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని విడుదలకు ముందే చూసిన ఆమె.. తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే, ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు ఉదయనిధి కూడా ఈ చిత్రాన్ని చూసి తన స్పందన తెలియజేశారు. "కూలీ' చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్ పూర్తి స్థాయిలో ఉంటుంది. రజనీకాంత్ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 50 యేళ్ళు పూర్తయిన శుభసందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు చిత్రపరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న అగ్ర నటుడు రజనీకాంత్. ఈ శుభతరుణంలో ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. రజనీ నటించిన 'కూలీ' గురువారం విడుదలకానుంది. ఈ చిత్రాన్ని ముందుగానే చూసే భాగ్యం లభించింది. ఇందులో అన్ని అంశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకు ఇది ఒక ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది' అని ఉదయనిధి పేర్కొన్నారు.

ప్రముఖ సినీ డిజైనర్ కుమార్ మృతి


కుమార్ (ఫైల్‌ఫొటో)

తమిళ చిత్రపరిశ్రమలో వెయ్యికిపైగా చిత్రాలకు డిజైనర్‌గా పనిచేసిన కుమార్ (67) ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దిగ్గజ దర్శకుడు దివంగత కె.బాలచందర్, అగ్ర నటులు రజనీకాంత్, కమల్ హాసన్, దర్శకులు భారతీరాజా, మణిరత్నం, కేఎస్ రవికుమార్, సురేష్ కృష్ణ, విక్రమ్, ఎస్‌జే సూర్య తదితరుల చిత్రాలకు డిజైనర్‌గా పనిచేశారు. 'విక్రమ్' నుంచి 'శెభాష్ నాయుడు' చిత్రాల వరకు కమల్‌తో కలిసి పనిచేసి, కమల్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ఆస్థాన డిజైనర్‌గా కొనసాగారు. కుమార్ మృతిపట్ల చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

అయ్యప్ప భక్తుల కష్టాల నేపథ్యంలో 'సన్నిధానం పీవో'


'సన్నిధానం పీవో' ఫస్ట్‌లుక్

శబరిమలై నేపథ్యంలో 'సన్నిధానం పీఓ' అనే పేరుతో ఓ చిత్రం రూపుదిద్దుకుంది. ప్రముఖ నటుడు యోగిబాబు, కన్నడ నటుడు రూబేష్ శెట్టి, వర్ష విశ్వనాథ్ ప్రధాన పాత్రలు పోషించారు. వీరితో పాటు చిత్ర, ప్రమోద్ శెట్టి, మూంద్రు రమేష్, గజరాజ్, రాజా రుద్రకొడి, సాధ్విక్, వినోద్ సాగర్ తదితరులు నటించారు. డెబ్యూ డైరెక్టర్ సారధి దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. సర్వదా సినీ గ్యారేజ్, రేజ్, షిమోగా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి మధుసూదన్ రావు, వి.వివేకానందన్, షబీర్ పఠాన్ నిర్మాతలు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'శబరిమలై వెళ్ళే అయ్యప్ప భక్తుల ఇబ్బందులను ప్రధానంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చిత్రీకరణ కేరళలోని శబరిమలై, పంబ, ఎరుమేలి, చెన్నై, పొల్లాచ్చి ప్రాంతాల్లో పూర్తిచేశాం. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు చేరన్, నటి మంజు వారియర్ రిలీజ్ చేశారు. త్వరలోనే ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అని వివరించారు.

రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో అవయవదానంపై వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న రేలా హాస్పిటల్ నర్సింగ్ విద్యార్థినులు, డాక్టర్లు, స్వచ్ఛంద సేవకులు

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినం సందర్భంగా బుధవారం అవయవాల దానంపై అవగాహన కల్పించేలా వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను తాంబరం ట్రాఫిక్ విభాగం డిప్యూటీ పోలీసు కమిషనర్ సామేసింగ్ మీనా జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ రేలా హాస్పిటల్ నుంచి మద్రాసు ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్ (మెపెజ్) వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ డీసీ గౌతమన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహమ్మద్ ఫారూఖ్, డాక్టర్ ఐశ్వర్యా రాజ్‌కుమార్ సహా 400 మంది పాల్గొన్నారు.

అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో క్యాథ్ ల్యాబ్ ప్రారంభం


క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సామినాథన్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో బుధవారం కొత్త క్యాథ్ ల్యాబ్‌ను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఎం.పీ సామినాథన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఆంకాలజీ అండ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ హర్షద్ రెడ్డి, అపోలో హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ మధు శశిధర్, క్లినికల్ లీడ్ అండ్ హెచ్‌ఓడీ డాక్టర్ ఏఎల్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ క్యాథ్ ల్యాబ్ ద్వారా రోగనిర్ధారణ సులువుగా నిర్ధారణ చేయగలుగుతారని, కార్డియాలజీ, న్యూరాలజీ, ఆంకాలజీ సంబంధిత రోగాలకు మెరుగైన చికిత్స అందించేందుకు వీలవుతుందని హర్షద్‌రెడ్డి తెలిపారు.

కావేరి హాస్పిటల్‌లో ఐదేళ్ల బాలుడికి అరుదైన చికిత్స



మీడియా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ మణికంఠన్, డాక్టర్ జి.బాలమురళి తదితర వైద్యనిపుణులు

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో తీవ్రమైన ముఖవైకల్యంతో బాధపడుతున్న ఐదేళ్ల బాలుడికి అరుదైన క్రానియోసినోస్టోసస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ మణికంఠన్, డాక్టర్ జి.మురళి తెలిపారు. బుధవారం ఉదయం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీరు ఆ వివరాలను వెల్లడించారు. కొన్ని గంటలపాటు జరిగిన ఈ శస్త్రచికిత్స ద్వారా బాలుడి రూపాన్ని సవ్యం చేయడమే కాకుండా దేహంలోని అన్ని భాగాలు సక్రమంగా పనిచేయగలుగుతున్నాయని వివరించారు. కపాల ముఖ వైకల్యం అనేది ఓ అరుదైన లోపమని, ప్రతి 2500 మంది పసికందుల్లో ఒకరు ఈ వైకల్యం పుట్టినప్పుడే ఏర్పడుతుందని చెప్పారు. కపాలంలోని ఎముకలు అపసవ్యంగా అతుక్కుపోవడం వల్లే ముఖ వైకల్యం ఏర్పడుతుందని, శస్త్రచికిత్స ద్వారా దీనిని సరిచేయవచ్చని తెలిపారు.



తిరునల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోమేగ్నెటిజం డైరెక్టర్ ప్రొఫెసర్ ఏపీ డిమ్రి తదితరులు పాల్గొన్నారు.

ప్యారడైజ్‌లో కబాబ్ ఫెస్ట్

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యారడైజ్ అవుట్‌లెట్లలో 'కబాబ్ ఫెస్ట్' ప్రారంభమైంది. ఈ వివరాలను బుధవారం ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ సీవీవో రాబిందర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ స్వతంత్ర గౌతం మీడియాకు వివరించారు. ఏడు దశాబ్దాల వారసత్వంతో ప్రామాణికమైన, రుచికరమైన హైదరాబాదీ వంటకాలందించే అతి పెద్ద ఆహార గొలుసు ప్యారడైజ్ వివిధ రకాల కబాబ్‌లను అందిస్తోందని తెలిపారు. జమ్మూ-కశ్మీర్ జాఫ్రానీ కల్మీ, మధ్యప్రదేశ్ రేష్మీ మలై కబాబ్, సేలం చికెన్ టిక్కా కబాబ్, మహారాష్ట్రకు చెందిన ఠెచా పనీర్ టిక్కా కబాబ్, రాజస్థాన్‌కు చెందిన మథానియా పనీర్ టిక్కా కబాబ్ వంటి అన్ని రకాల కబాబ్‌లను అందుబాటులో వుంచుతున్నామన్నారు. నాణ్యత పాటిస్తూ ఆహారాలు అత్యంత ప్రామాణికమైన రుచికి అనుగుణంగా ఉంచబడతాయని వివరించారు.


కబాబ్‌లను పరిచయం చేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులు లేక, రాక 207 పాఠశాలల మూత ?


బీజేపీ నేత అన్నామలై స్వగ్రామం ఊత్తుపట్టిలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులు లేక, రాకపోవటం తదతర కారణాలతో 207 ప్రభుత్వ పాఠశాలలు వరుసగా మూతపడుతున్నాయి. రాష్ట్రంలో 31,332 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలలున్నాయి. ఒకటి నుండి 8 వరకు 18,46,550 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో కొన్నింటిలో ఏడెనిమిది మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఒకే ఒక విద్యార్థి చదువుతున్న పాఠశాలలు కూడా ఉన్నాయి. ద్విసంఖ్యలో విద్యార్థులు లేని పాఠశాలలను మూసివేసి, అక్కడ చదువుతున్న ఆరేడుగురు విద్యార్థులను సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ పరిస్థితులలో చదివేందుకు ఒక్కడంటే ఒక్కడు కూడా లేని 207 పాఠశాలలు వరుసగా మూతపడుతున్నాయి. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం కరోనా లాక్‌డౌన్ కారణంగా ఆర్థిక పరిస్థితులు క్షీణించిన కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కరోనా సంక్షోభం తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నవారంతా మళ్ళీ ప్రైవేటు పాఠశాలల వైపు పరుగులు తీశారని చెప్పారు. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు క్రమంగా తగ్గుతోందని చెప్పారు. ఈ విద్యాసంవత్సరంలో ఒక విద్యార్థి కూడా లేనందున 207 ప్రభుత్వ పాఠశాలలను క్రమంగా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థులు లేని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని చుట్టుపక్కల ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీ చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ పాఠశాలలన్నీ తాత్కాలికంగా మూసివేస్తున్నామని, త్వరలో విద్యార్థులు వస్తారని ఎదురుచూస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతియేటా తగ్గుతున్నదే కాని, ఏ మాత్రం పెరగటం లేదు. ఉపాధ్యాయుల్లో పలువురు తమ సొంతూళ్ళకు దగ్గరగా ఉన్న పాఠశాలలకు బదలీపై వెళ్ళేందుకు ఆశపడుతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం ఈ ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఆసక్తి కనబరచటం లేదు. దీంతో పాఠశాలల్లో అడ్మిషన్లు లేక శూన్యస్థితికి చేరుకుంటున్నాయి. విద్యార్థులు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులతో ఒకటి నుండి ఐదో తరగతి దాకా ఉన్న విద్యార్థులకు ఎలా సక్రమంగా పాఠాలు ఎలా చెప్పగలుగుతారనే అనుమానంతో తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియం ప్రైవేటు పాఠశాల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలంటే ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మౌలిక సదుపాయాలను పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే సమయంలో పాఠశాలల్లోని విద్యార్థులకు సరిపడా సంఖ్యలో ఉపాధ్యాయులను కూడా నియమించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

అన్నామలై ఊరిలోని పాఠశాల కూడా....

బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై సొంతూరు తొట్టంపట్టి కరూరు జిల్లా కే పరమత్తి సమీపంలో ఉంది. ఆ తొట్టంపట్టికి చేరువగానే ఊత్తుపట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లోనే అన్నామలై ఓటేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో చదివేందుకు విద్యార్థులెవరూ రాక ఆ పాఠశాల కూడా మూతపడింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం విద్యార్థులు లేక నీలగిరి జిల్లాలో 17 ప్రాథమిక పాఠశాలలు, శివగంగలో 16, దిండుగల్ జిల్లాలో 12, చెన్నై, ఈరోడ్ జిల్లాల్లో తలా 10 పాఠశాలలు, కోయంబత్తూరు, రామనాథపురం జిల్లాల్లో తలా 9 పాఠశాలలు చొప్పున మూతపడ్డాయి. ఇదే విధంగా తూత్తుకుడి జిల్లాలో 8, ధర్మపురి, తిరుప్పూరు, విరుదునగర్ జిల్లాల్లో తలా 7 చొప్పున, కళ్ళకుర్చి, సేలం, వేలూరు జిల్లాల్లో తలా 6 చొప్పున, తిరుచ్చి, తిరునల్వేలి జిల్లాల్లో తలా 5 చొప్పున పాఠశాలలను మూసివేశారు. చెంగల్పట్టు, కన్నియాకుమారి, కరూరు, తంజావూరు, తిరువళ్లూరు, విల్లుపురం జిల్లాల్లో తలా 4 చొప్పున పాఠశాలలు మూతపడ్డాయి. తిరువణ్ణామలై, పుదుకోట, రాణిపేట, తేని జిల్లాల్లో తలా 3 చొప్పున, కడలూరు, తెన్‌కాశి, తిరుపత్తూరు, కాంచీపురం జిల్లాల్లో తలా 2 చొప్పున, నాగపట్టినం, తిరువారూరు జిల్లాల్లో తలా 1 చొప్పున మొత్తం 207 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి.


విజేతలతో కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ తదితరులు

ఎస్‌కేపీసీలో ముగిసిన ఈషా కల్చరల్ ఫెస్ట్

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)కు చెందిన ఐక్యూఏసీ, అండ్ కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన అంతర్విభాగ కల్చరల్ ఫెస్ట్ వేడుకలు బుధవారం ముగిశాయి. గ్రూప్ సింగింగ్, మూవీ వాక్, గ్రూప్ డాన్స్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు సినీ పాటలకు అనుగుణంగా నృత్యం చేసి అలరించారు. విద్యార్థినుల్లోని ప్రతిభను గుర్తించేలా నిర్వహించిన ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ప్రముఖులను, విజేతలను కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరి శరత్‌కుమార్ జ్ఞాపికలు ప్రదానం చేసి అభినందించారు.

ముసురు మబ్బుల్లో తిరుమల



తిరుమలలో బుధవారం చిరు జల్లులు, చల్లగాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వానమబ్బులు కమ్మేసి తెల్లవారు జాము నుంచీ వాన కురుస్తూనే ఉంది. ఘాట్‌రోడ్లలోని కొన్ని ప్రాంతాల్లో విజిలెన్స్, ఫారెస్ట్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,596

తలనీలాలు సమర్పించినవారు: 31,565





తిరుపతి-ఆంధ్రజ్యోతి

చిత్తూరు-నాయుడుపేట ఆరులైన్ల రహదారిలో సి.మల్లవరం నుంచి రేణిగుంట కేఎల్‌ఎం కూడలి దాకా మాత్రమే నాలుగులైన్ల రహదారి ఉండిపోయింది. దీన్ని కూడా ఆరులైన్ల రహదారిగా విస్తరించే పనులు జోరుగా సాగుతున్నాయి. 17.40 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారిపై కొత్తగా మూడు ఫ్లైవోవర్లు, 5 అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. సర్వీస్ రోడ్లు ఉంటాయి. 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే' గా రూపుదిద్దుకుంటున్న ఈ జాతీయ రహదారి తిరుపతి నగర విస్తరణలో కీలక పాత్ర పోషించబోతోంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ 2024 నవంబరు 5న దీనికి నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి ఎన్‌హెచ్ 716గా నామకరణం చేశారు. ఇప్పటివరకు 11 శాతం పనులు పూర్తయ్యాయి. ఏడాదిన్నరలో పూర్తిగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విస్తరణ పనులతో పాటు రామానుజపల్లె, మల్లవరం వద్ద అండర్ పాస్ పనులు మొదలుపెట్టారు.

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే ప్రత్యేకతలు

వేగంగా, సురక్షితంగా వాహనాలు ప్రయాణించేలా ఈ హైవే నిర్మాణం జరుగుతోంది. హైవేను క్రాస్ చేసే అవసరం ఎక్కడా ఇక ఉండదు. హైవేకి సమాంతరంగా అటూ, ఇటూ సర్వీస్ రోడ్లు ఉంటాయి. హైవే మీదకు ఎక్కడానికీ, దిగడానికీ ఈ సర్వీస్ రోడ్లలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. పశువులు హైవే మీదకు వచ్చే వీలే లేకుండా బారికేడ్లు నిర్మిస్తారు.


గందరగోళం.. కెఎల్‌ఎం సర్కిల్


ఇక్కడ కూడా ఫ్లైవోవర్ వస్తుంది

మూడు ఫ్లైవోవర్లు

హైవేపై మూడుచోట్ల ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం కేఎల్‌ఎం ఆసుపత్రి కూడలి గందరగోళంగా ఉంటుంది. తిరుపతి నుంచి నాయుడుపేట వైపునకు వెళ్లే ఆరు వరసల హైవేలోంచి చెన్నైకి నాలుగు వరసల కూడలి చీలుతుంది. ఇదే కూడలిలో రేణిగుంట నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఇక్కడ ఎటు నుంచి ఎటు తిరగాలో అర్థంగాక వాహనదారులు గందరగోళపడుతుంటారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే మల్లవరం కూడలి కూడా ప్రమాదాలకు దారితీసేలా ఉంది. ఈ రెండు కూడళ్ల వద్దా ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. అలాగే అవిలాల క్రాసింగ్‌లో మరొక ఫ్లైవోవర్ నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ ఆగిపోతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి.

ఈ కూడలి ప్రమాదకరం



ప్రస్తుతం హైవేల్లో మర్రిగుంట కూడలి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎయిర్‌పోర్టు వైపునుంచి తిరుపతి వైపునకు వస్తున్నపుడు రేణిగుంట చెక్‌పోస్టు నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఈ కూడలి గందరగోళంగా ఉండడంతో వేగంగా ప్రయాణించే వాహనాలు హఠాత్తుగా ఎటు మళ్లాలో అర్థం కాక సడన్ బ్రేకు వేసి పల్టీలు కొడుతున్నాయి. ఇక్కడ సురక్షితమైన కూడలి గానీ, ఫ్లైవోవర్ గానీ అవసరం.

ఐదు అండర్ పాస్‌లు

మల్లవరం కూడలి నుంచి కేఎల్‌ఎం కూడలి దాకా అనేక చోట్ల హైవేను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. ఆర్సీపురం, పచ్చికాపలం వరకూ ఉన్న పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇందుకు పరిష్కారంగా అడర్‌పాస్‌ల నిర్మాణం జరుగుతోంది.

- పేరూరు జంక్షన్, రామానుజపల్లె చెక్‌పోస్ట్ జంక్షన్‌లలో భారీ వాహనాలు సైతం వెళ్లేలా(వీయూపీ) అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.
- తనపల్లి క్రాస్, తిరుచానూరు జంక్షన్‌లలో కార్లు, మినీ వ్యాన్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా ఎల్‌వీయూపీ అండర్ పాస్‌లు నిర్మిస్తారు. ఇది 4.5 మీటర్ల ఎత్తు ఉంటుంది.
- ఎమ్మార్‌పల్లి - మల్లవరం రోడ్డులో ఉప్పరపల్లి జంక్షన్‌లో కార్లు, బస్సులు వెళ్లేలా (ఎస్‌వీయూపీ)అండర్ పాస్ నిర్మిస్తారు. ఈ అండర్‌పాస్ 5.5మీటర్ల ఎత్తు ఉంటుంది.


ఆదమరిస్తే అంతే- తిరుచానూరు జంక్షన్


ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తారు


డేంజరస్ సర్కిల్.. ఈ తనపల్లి క్రాస్

టోల్ తప్పదు

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే మీదకు నగరంలో నుంచి ఎక్కాలనుకుంటే మాత్రం టోల్ ఫీజు చెల్లించాలి. ప్రస్తుతం హైవేపై మేర్లపాక వద్ద, పాకాల వద్ద టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఇవి కాకుండా సర్వీస్ రోడ్డులోంచి ఎక్కే దగ్గర కూడా టోల్‌బూత్‌లు పెడుతారు. హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ల తరహాలో ఇవి ఉంటాయి. కింది ప్రాంతాల్లో టోల్‌బూత్‌లు ఉంటాయి. ఎంటర్ చేసిన ప్లాజా నుంచి ఎగ్జిట్ ప్లాజా వరకు ప్రయాణ దూరం ఆధారంగా టోల్ వసూలు చేస్తారు. రెండు బస్ షెల్టర్లు కూడా ఏర్పాటు చేస్తారు.

- తిరుపతి నుంచి మదనపల్లె వెళ్లే మార్గంలో సీ.మల్లవరం జంక్షన్ వద్ద
- శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వెళ్లే వైపు తొండమనాడు దగ్గర
- ఆర్సీపురం జంక్షన్ (అవిలాల క్రాస్) వద్ద
- గాజులమండ్యం జంక్షన్ (ఫ్లైఓవర్ కింద చెన్నై మార్గంలో)
- నగరి దగ్గర రెండు

50 నియోజకవర్గాలపై బీజేపీ దృష్టి?

● ఇప్పటికే ఆయా స్థానాలను గుర్తించిన నేతలు



చెన్నై, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గట్టిగా నిలదొక్కుకోవాలనే ఆకాంక్ష, బలమైన మిత్రపక్షాలు జతకట్టపోవడం, కూటమిలో బోలెడన్ని స్థానాలున్న నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ భావిస్తోంది. ఇందులో భాగంగా ఈసారి 50 చోట్ల పోటీ చేయాలనే ఆలోచనలో ఉంది. తమకు బలమున్న స్థానాలను ఇప్పటికే గుర్తించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం.. ఆ మేరకు జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. అన్నాడీఎంకేపై ఒత్తిడి తెచ్చి, ఆ మేరకు స్థానాలను చేజిక్కించుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అంతేగాక రాజధాని చెన్నైలో ఈ సారి ఎలాగైనా బోణీ కొట్టాలని కూడా బీజేపీ నాయకత్వం అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ వేర్వేరుగా పోటీ చేయడంతో డీఎంకే లబ్ధి పొందింది. ఆరణి, కళ్లకుర్చి, విల్లుపురం, నామక్కల్, కోయంబత్తూరు, ధర్మపురి, కృష్ణగిరి, కడలూరు, చిదంబరం, తెన్‌కాశి, విరుదునగర్ తదితర నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే-బీజేపీ అభ్యర్థుల ఓట్లను లెక్కిస్తే.. విజయం సాధించిన అభ్యర్థుల కన్నా అధికంగా వున్నట్లు తేలింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీలు విడిపోవడం వల్లనే నష్టపోయినట్లు స్పష్టమైంది. చెన్నైలోని 18 నియోజకవర్గాల్లో 13 చోట్ల తాము రెండో స్థానంలో వుంటామని బీజేపీ నేతలు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారికి తమకు వచ్చిన ఓట్లను లెక్కించుకుని, ఆ మేరకు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో 20 చోట్ల పోటీ చేసిన బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకోగలిగింది. ఈసారి మాత్రం 50 స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ నేతృత్వంలోని నాయకత్వం కృతనిశ్చయంతో ఉంది.

శశికళ రాష్ట్ర వ్యాప్త పర్యటనకు ఏర్పాట్లు

అన్నాడీఎంకే దరిచేరనీయక, సొంత పార్టీ ఏర్పాటుకు స్థోమత లేక డీలాపడిన దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ.. రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్రమాస్తుల కేసులో అరెస్టైన అనంతరం శశికళకు ప్రాభవంతో పాటు అన్నాడీఎంపై పూర్తిగా పట్టుపోయింది. జైలు నుంచి వచ్చాక మళ్లీ అన్నాడీఎంకేలోకి అడుగు పెట్టేందుకు ఆమె చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అయితే అన్నాడీఎంకేలోని అసంతుష్ట నేతలంతా మళ్లీ ఒక్కటవుతారని, పార్టీకి పూర్వ వైభవం వస్తుందంటూ ఆమె వరుసగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రకటనలు గుప్పిస్తూనే వున్నారు. కానీ ఎక్కడా ఆ ప్రయత్నాలు సఫలమైనట్లు కనిపించడం లేదు. ఆమె నమ్ముకున్న బీజేపీ గానీ, ఆమెకు నమ్మకద్రోహం చేసిన నేతలు గానీ ఆమెను దరి చేర్చుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదు. చివర్లో ఆమె పంచన చేరిన ఓపీఎస్‌కు గానీ, బంధువు టీటీవీ దినకరన్ గానీ ఆమెను బలోపేతం చేసే పరిస్థితి లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో శశికళ రాష్ట్ర వ్యాప్త పర్యటన చేయాలని నిర్ణయించుకున్నారు. తద్వారా తన ప్రత్యర్థులను పరోక్షంగా నష్టపరిచేందుకు ఆమె సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

గవర్నర్ తేనేటి విందు బహిష్కరణ

● కాంగ్రెస్, డీపీఐ, సీపీఐ ప్రకటన

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హక్కులను కాలరాస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసే తేనేటి విందును బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్, డీపీఐ, సీపీఐ పార్టీలు ప్రకటించాయి. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరుంతగై బుధవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రప్రజలు, ప్రభుత్వ హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి తీరును ఖండిస్తూ ఆయన స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే తేనేటి విందులో టీఎన్‌సీసీ ఎమ్మెల్యేలు, ప్రధాన నేతలు పాల్గొనకుండా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ తేనేటి విందు బహిష్కరణపై విడుదల చేసిన ప్రకటనలో ప్రజాస్వామ్యంలో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత గవర్నర్లదేనని, అయితే రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆర్‌ఎన్.రవి రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ ఏర్పాటు చేసే తేనేటి విందును తమ పార్టీ బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ గవర్నర్ అధికారం గురించి సుప్రీంకోర్టు స్పష్టమైన వివరణతో ఇచ్చిన తీర్పును గవర్నర్ ఆర్‌ఎన్ రవి శిరసావహించలేదని, తన అధికారాన్ని దుష్ప్రయోగం చేస్తున్న గవర్నర్‌ను ఖండిస్తూ తేనేటి విందులో పాల్గొనేదిలేదని ఆయన తెలిపారు.

నేటినుంచి తిరుత్తణి-అరక్కోణం మధ్య ప్రత్యేక సబర్బన్ రైళ్లు

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆడి కృత్తికను పురస్కరించుకుని తిరుత్తణి-అరక్కోణం మధ్య గురువారం నుండి ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక సబర్బన్ ం ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు అరక్కోణం నుండి బయలుదేరే ప్రత్యేక ఈఎంయూ ఉదయం 10.45 గంటలకు తిరుత్తణి చేరుకుంటుంది. మరుమార్గంలో అక్కడినుండి ఉదయం 10.50 గంటలకు బయలుదేరి 11.10 గంటలకు అరక్కోణం చేరుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు అరక్కోణం నుండి బయలుదేరి 1.25 గంటలకు తిరుత్తణికి చేరుకుంటుంది. అక్కడినుండి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు అరక్కోణం చేరుకుంటుంది. అలాగే మధ్యాహ్నం 2.50 గంటలకు అరక్కోణం నుండి బయలుదేరే రైలు 3.15కు తిరుత్తణికి చేరుతుందని దక్షిణరైల్వేశాఖ తెలిపింది.

బస్సు ఢీకొని టెంపో డ్రైవర్ మృతి

కుప్పం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నడిమూరు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెంపో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కుప్పం-కృష్ణగిరి జాతీయ రహదారిపై నడిమూరు వద్ద కుప్పం నుంచి తమిళనాడు వైపు కోళ్ల లోడ్‌తో వెళ్తున్న టెంపోను తమిళనాడు నుంచి కుప్పం వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన టెంపో డ్రైవర్ మునిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు.

మూషిక వాహనంపై గణనాథుడు



పాకాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం శ్రీకారం చుట్టుకున్నాయి. ఉభయదారులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం కలశస్థాపన హోమం జరిగింది. రాత్రి వినాయకస్వామి మూషిక వాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. అయిదు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

తాంబరంలో ఎయిర్ ఫోర్స్ ఉద్యోగ శిబిరం

ప్యారీస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో భారత విమాన దళానికి, అగ్నివీర్ పథకంలో అర్హత గల అభ్యర్థులను ఎంపిక చేసే శిబిరం వచ్చే సెప్టెంబర్ 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎయిర్ ఫోర్స్ అధికారులు తెలిపారు. వివాహం కాని యువకులు అగ్నివీర్ పథకం ప్రకారం మిలటరీ, విమాన దళంలో చేరేందుకు తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన వారిని ఈ ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం టెన్త్, ప్లస్‌టూ ఉత్తీర్ణులైన ఏదైనా డిగ్రీ పొందిన అభ్యర్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు సమర్పించవచ్చు. వివరాలను https://agnipathvayu.cdac.in/AV/ అనే వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



బహుమతి ప్రదానం చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, పక్కన ముఖ్య అతిథి రామస్వామి, కంట్రోల్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ మాట్లాడుతూ చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంతో భారత్ కీర్తి పెరిగిందని, ఈ విజయానికి గుర్తుగా ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాల్లో 7 చోట్ల ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ మాజీ కార్యదర్శి టి.రామస్వామి అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ముత్త చెర్రియన్, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.